ఎమ్మెల్యే పద్మారావుకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బస్తీవాసులు

లాలాపేట: అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన పద్మారావుగౌడ్‌ను శుక్రవారం చంద్రబాబునగర్ బస్తీవాసులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బస్తీ అభివృద్ధికి సహకరించాలనీ ఈ సందర్భంగా వారు పద్మారావును కోరారు. కోళ్ల వెంకటేష్‌యాదవ్, మహేష్, ప్రభాకర్, హరియాదవ్ బస్తీవాసులు పాల్గొన్నారు.

కుమ్మర్లకు ప్రాధాన్యం కల్పించాలి



ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు

లాలాపేట: రాష్ట్రంలో ఇటీవల నూతనంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకులు ఆంజనేయులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం లాలాపేటలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంలో తెలంగాణలోని కుమ్మర్లకు జనాభా దామాషా ప్రకారం పాలనాపదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో పనిచేసిన ప్రభుత్వాలు కుమ్మర్లను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. తెలంగాణలో మొట్టమొదటిసారిగా ఏర్పాటైన ప్రజా ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని ఆయన కోరారు. 6 నెలల్లో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కుమ్మర్లకు పోటీచేసే అవకాశం కల్పించాలన్నారు.

వ్యర్థాలను తొలగించండి !



రోడ్డుపై పేరుకుపోయిన మట్టి వ్యర్థాలు ఇలా..

బౌద్ధనగర్: రోడ్డుపై పేరుకుపోయిన మట్టి వ్యర్థాలను తొలగించాలంటూ.. వారాసిగూడలోని కనకదుర్గ దేవాలయం సమీప ప్రాంతవాసులు వాపోతున్నారు. బస్తీలో నూతన రోడ్డు వేసి నెలలు గడుస్తున్నా.. రోడ్డు వేసిన సమయంలో వెలువడిన మట్టి వ్యర్థాలను ఇప్పటికీ తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యమని చెప్పుకొస్తున్నారు. దీనిద్వారా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు చెప్పినా కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోండి !



జామై ఉస్మానియా వద్ద రోడ్డు పక్కనే అక్రమ పార్కింగ్

బౌద్ధనగర్: జామై ఉస్మానియా వద్ద రోడ్డుకు ఇరువైపులా చేసిన అక్రమ పార్కింగ్ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో వాహనాలు రోడ్డు పక్కనే అక్రమంగా పార్క్ చేస్తున్నారని, దీంతో నిత్యం రాకపోకలు సాగించే వారు నానా ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. అంతే కాకుండా కొన్ని వాహనాలైతే నెలల తరబడి ఇక్కడే ఉంటున్నాయని, వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. సంబంధిత ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికైనా సదరు వాహనాలను తొలగించి రోడ్డు మార్గాన్ని సుగమం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ప్రీ క్రిస్మస్ వేడుకలు

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని చర్చిలన్నీ కలిపి ఒకేచోట నిర్వహించుకునే ప్రీ క్రిస్మస్ వేడుకలను గత 27 ఏళ్లుగా 'యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్' పేరుతో ఇక్కడి లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో ఘనంగా జరుగుతున్నాయి. యునైటెడ్ క్రిస్మస్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ బీ.జీ. విలియం అధ్యక్షతన శనివారం సాయంత్రం 6 గంటలకు జరుగనున్న 27వ యునైటెడ్ క్రిస్మస్ వేడుకలకు ప్రధాన వక్తగా గుడ్‌విల్ అంబాసిడర్ టు ఇజ్రాయిల్ వర్డ్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్ డాక్టర్ కోన శౌరిబాబు హాజరుకానున్నట్లు సమాచారం. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ సెంటర్ ప్రాంగణ పరిసరాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సన్నాహాలు చేస్తున్నారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు సంఘం చైర్మన్ దొడ్డ శివముదిరాజ్, అధ్యక్షుడు సదానంద్, ముఖ్య సలహాదారు వీరేశం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ముదిరాజ్‌లు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రజని నియామకంపై హర్షం

కవాడిగూడ: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రేవంత్ రెడ్డి గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన దివ్యాంగురాలు రజనీకి ఉద్యోగ నియామక పత్రాలపై రెండో సంతకం చేయడం పట్ల తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం బండమైసమ్మనగర్‌లో సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, రాష్ట్ర నాయకులు శివరత్నం, చంద్రప్రకాష్, బాలయ్య, మల్లేష్, సంగీత, భగవాన్, సంఘం యువజన విభాగం అధ్యక్షుడు అంబటి సుధాకర్ మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు నిరసన దీక్షలో పాల్గొన్న రజనీ తనకు ఉద్యోగం కావాలని రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన విషయాన్ని గుర్తుంచుకున్న రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే ఆమెకు ఉద్యోగం ఇవ్వడం అభినందనీయమన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో గంగపుత్రులు వివక్షకు గురయ్యారని కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కట్ట నర్సింగ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుంతల్.. చింతల్ !



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



ప్రభుత్వ పాఠశాల ఎదుట రోడ్డు ఇలా..

- అధ్వానంగా బస్తీరోడ్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. లాలాపేట, చంద్రబాబునగర్, శ్రీపురి కాలనీ, ఇందిరానగర్, సత్యానగర్ తదితర బస్తీల్లో పేద, మధ్యతరగతి ప్రజలే నివసిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. అక్కడక్కడా పైకి తేలిన మ్యాన్‌హోళ్లు, గుంతల రోడ్లగుండా స్థానికులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. సంబంధిత అధికారులు కనీసం ఈ బస్తీల వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బస్తీ రోడ్లన్నీ ఛిద్రమైనా సంబంధిత అధికారులు ఇటువైపు చూసిన పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిపేసిన పునరుద్ధరణ పనులు..

- జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం, జలమండలి విభాగాల ఆధ్వర్యంలో గతంలో చేపట్టిన పైపులైన్ నిర్మాణానికి రోడ్లను ఇష్టానుసారంగా తవ్వారని స్థానికులు చెబుతున్నారు. పైపులైన్ నిర్మాణం పూర్తిచేశాక ఆ ప్రాంతాల్లో చేయాల్సిన రెస్టోరేషన్ వర్క్స్ (రోడ్డు పునరుద్ధరణ పనులు) చేయకుండా సదరు కాంట్రాక్టర్లు మట్టి పోసి వదిలేయడంతో బస్తీలోని రోడ్లన్ని దెబ్బతిన్నాయని మండిపడుతున్నారు.
- సంబంధిత అధికారులు దగ్గరుండి రోడ్డు పునరుద్ధరణ పనులు చేయాల్సి ఉన్నప్పటికీ వారు విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. ప్రజలకు కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ప్రజలంటున్నారు.

వాహనాల తాకిడితో కొట్టుకుపోయిన మట్టి..

- వాహనాల తాకిడికి మట్టి కొట్టుకుపోయి రోడ్డు పొడవునా కాలువలాగా ఏర్పడింది. ఇటీవల తుపాన్‌తో కురిసిన వర్షాలకు బస్తీరోడ్లు బురదగా మారాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి.

నిధులు మంజూరైనా.. రోడ్డు వేయడం లేదు.



చంద్రబాబునగర్‌లో నూతన రోడ్ల నిర్మాణానికి దాదాపు ఆరు నెలల క్రితం సుమారు రూ. 25 లక్షలు మంజూరైందని అధికారులు చెప్పారు. ఇప్పటి వరకు రోడ్ల నిర్మాణం చేపట్టలేదు. తామే స్వంతగా రోడ్డుపై ఏర్పడిన కాలువను మట్టితో పూడ్చాం. దీనిపై అధికారులు వెంటనే స్పందించి రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

– కోళ్ల వెంకటేష్ యాదవ్, బస్తీ అధ్యక్షుడు

తలసానికి అభినందనల వెల్లువ



అభినందనలు తెలుపుతున్న ఆలయ అధికారులు



తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం అధికారులు అభినందించారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తలసాని నివాసానికి వెళ్లి సన్మానించి అభినందనలు తెలిపారు. ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కుంట నాగరాజు ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ సాయిబాబాగౌడ్, అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌పంతులు, కొలను బాల్‌రెడ్డి, కూతురు నర్సింహ, ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్: మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను శుక్రవారం కూడా నియోజకవర్గ పరిధిలోని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం, ఎస్ఆర్‌నగర్‌లోని గణేష్ టెంపుల్, ఉజ్జయినీ మహంకాళి ఆలయ అర్చకులు ఆయనను వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు. ఆయా ఆలయాలకు చెందిన కమిటీ సభ్యులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. జైన్ సమాజ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, మహంకాళి ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి, బల్కంపేట ఆలయ ట్రస్టీ సాయిబాబాగౌడ్, కమిటీ సభ్యులు బచ్చు మహేష్, మహేందర్, దుబాయ్ శ్రీను, జగదీష్ ప్రసాద్, బల్కంపేట ఆలయ కమిటీ సభ్యులు పుష్పలత, గౌతమ్, కూతురు నర్సింహ్మా, రోజారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పరామర్శ..

సనత్‌నగర్‌లోని జాఫ్రీ మసీదు కమిటీ అధ్యక్షులు నోమాన్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. నోమాన్ తల్లి, మాజీ అధ్యక్షుడు సిరాజుద్దీన్ భార్య అనారోగ్యంతో బాధపడుతూ రెండ్రోజుల క్రితం మరణించారు. విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టీలోని నివాసానికి వెళ్లి నోమాన్, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కొలను బాల్‌రెడ్డి, శేఖర్, ఖలీల్, ఫాజిల్, కరీం, జమీర్, రఫీక్ తదితరులున్నారు.

సంఘం అభ్యున్నతికి కృషి చేయాలి



ప్రారంభోత్సవంలో పాల్గొన్న అడ్డగుట్ట ముదిరాజ్ సంఘం సభ్యులు

అడ్డగుట్ట: ముదిరాజ్‌లు సంఘటితంగా ముందుకు సాగుతూ హక్కులను సాధించుకోవాలని అడ్డగుట్ట ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బోయిని నరేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం అడ్డగుట్టలో ముదిరాజ్ సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదిగేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అడ్డగుట్టలో ముదిరాజ్ సంఘం ఏర్పడి 22 ఏళ్లు గడుస్తుందన్నారు. ఇప్పటికే అనేక సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేశామని, ప్రస్తుతం సంఘం బాధ్యతలను యువ నాయకులకు అప్పటిస్తున్నట్లు ప్రకటించారు. సంఘం ఉపాధ్యక్షుడు చవ్హాన్ శేఖర్, గోకరి రమేష్, సురేష్, గణేష్, ఉదయ్‌కాంత్, చిరంజీవి, కనకయ్య, ప్రవీణ్ తదితరులున్నారు.

ఆరోగ్య మిత్రుల సమస్యలను పరిష్కరించండి



ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆరోగ్య శ్రీ విభాగంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ప్రగతిభవన్‌లోని ప్రజాదర్బార్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఆరోగ్య శ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరియాదయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలని, కనీస వేతనం అమలు చేసి టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని, 16 ఏళ్లుగా పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్రలను తిరిగి పీహెచ్‌సీల్లోనే నియమించాలని, షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఆరోగ్య మిత్రలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. త్వరలోనే ఆరోగ్య శ్రీ శాఖ ఉద్యోగులకు తగిన న్యాయం చేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అభినందనలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అభినందిస్తున్న రాజ్‌కుమార్

కాచిగూడ: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.రాజ్‌కుమార్, కె.రాముల ఆధ్వర్యంలో ప్రతినిధులు అభినందించారు. ప్రగతి భవన్‌కు మహాత్మ జ్యోతిరావు పూలే భవన్‌గా నామకరణం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ ఉద్యమంలో కీలక పాత్ర వహించి, బీసీల ఆర్థిక సామాజిక పరిస్థితులపై అవగాహన ఉన్న పొన్నం ప్రభాకర్ ఆ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో బీసీల సమస్యల పరిష్కారంతో పాటు బీసీల అభివృద్ధి జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

స్వచ్ఛంద సంస్థలను ఆదుకోండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆదిలీలా ఫౌండేషన్ సభ్యుల వినతి

లిబర్టీ: ప్రజాహితం కోసం పని చేస్తున్న సంస్థలకు కేంద్ర ప్రభుత్వం చేయూత నివ్వాలని కేంద్ర పర్యటన శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్.ఆదినారాయణ విన్నవించారు. శుక్రవారం ఫౌండేషన్ ప్రతినిధి బృందం కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజలకు సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, కళా సాహితీ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న సంస్థలకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారన్నారు. సేవా సంస్థలు పేద, మధ్య తరగతి అణగారిన వర్గాలకు సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.15, నల్ల వంకాయ రూ.23, పొడుగు వంకాయ రూ.23 బెండకాయ రూ.45, పచ్చిమిర్చి రూ.35, బజ్జిమిర్చి 85, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 11, క్యారెట్ 25, దొండకాయ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 20, దోసకాయ 25, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 38, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 18, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఏబీవీపీ 'లా స్టూడెంట్స్ ఫోరమ్' కన్వీనర్‌గా సాయిప్రసాద్ గౌడ్



కాచిగూడ: ఢిల్లీలో జరిగిన ఏబీవీపీ 69వ జాతీయ మహాసభల్లో తెలంగాణ రాష్ట్ర లా స్టూడెంట్స్ ఫోరమ్ కన్వీనర్‌గా కొండ సాయి ప్రసాద్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ యువత సమాజం కోసం కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఏబీవీపీలో కాలేజ్ సెక్రటరీ నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగిన కొండ సాయి ప్రసాద్‌ను పలువురు విద్యార్థులు అభినందించారు.

ఫైప్‌లైన్ పనులు వేగవంతం చేయాలి

కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్, వినాయక్‌నగర్‌లో నెలకొన్న కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నట్లు కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ తెలిపారు. ఇటీవల వినాయక్‌నగర్ బస్తీ వాసులు నల్లాల్లో తాగునీటిలో కలుషిత నీరు వస్తుందని వచ్చిన ఫిర్యాదు మేరకు వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో రూ.9లక్షల వ్యయంతో సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. శుక్రవారం ఆమె బీజేపీ నేతలు, వాటర్‌వర్క్స్ సిబ్బందితో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్మాణ పనులు చేపట్టి త్వరలోనే ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకటేష్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, పరుశురాం, మహేందర్‌బాబు, శ్రీనివాస్‌ముదిరాజ్, శంకర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అత్యాధునిక వసతులు

కాచిగూడ: హర్రాస్‌పెంట హిందూ శ్మశాన వాటికలో మెరుగైన వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం సమితి సర్వసభ్య సమావేశం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా స్మశాన వాటిక ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా శ్మశాన వాటికకు అనుబంధంగా ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నిర్వహణతో పాటు పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు క్లినిక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలకు కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని, ఫిజియో థెరపీ సేవలు, యోగా సెంటర్ ఏర్పాటు చేశామని, స్మశాన వాటిక ఆధ్వర్యంలో మూడు సత్రాల నిర్వహణ చేపట్టామన్నారు. స్మశాన వాటికలో పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు రాజ్‌కుమార్ విగ్, రాజేందర్ పటేల్, వీరస్వామి, విజయ్‌కుమార్, సి.నంద కిషోర్, ఎం.మహేందర్, సత్యనారాయణ, మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా బాలోత్సవ ముగింపు వేడుకలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బాలోత్సవ ముగింపు వేడుకలు శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం సమీపంలోని విప్రో చంద్రయాన్ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. 102 పాఠశాలకు చెందిన 6 వేల మంది విద్యార్థులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బతుకమ్మ, దాండియా, సైన్స్ ప్రదర్శన, కోలాటంతో పాటు సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై డెక్కన్ పత్రిక ఎడిటర్ వేదకుమార్, భారత్ విద్యా సంస్థల అధినేత వేణుగోపాల్, తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు పిల్లల కోసం సమయాన్ని కేటాయిస్తూ వారిలోని ప్రతిభను ప్రోత్సహించాలన్నారు. బాలోత్సవం కార్యదర్శి సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి, సుజావతి, కోయ వెంకటేశ్వర్లు, విజ్ఞాన దర్శని కన్వీనర్ రమేష్, మమత, రూపా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శరణుఘోషతో మార్మోగుతున్న అయ్యప్ప ఆలయం



సనత్‌నగర్ అయ్యప్ప దేవాలయం

సనత్‌నగర్: నగరంలో రెండో ఆలయంగా సనత్‌నగర్ అయ్యప్ప ఆలయం.. సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో 1983 తర్వాత చేపట్టిన సకల దేవతామూర్తుల దేవాలయాల నిర్మాణ పరంపరలో భాగంగా అయ్యప్పస్వామి దేవాలయం కూడా వెలిసింది. నిర్మాణం వెనుక దామోదర్‌రెడ్డి, కంజర్ల శంకర్‌యాదవ్, పీవీ సుబ్బారావు, అరుణ్‌గురుస్వామి, పార్థసారధి, సాయి, అమర్‌నాథ్‌గుప్తా, సురేశ్, ఎల్.నర్సింగరావు, యెంజాల నర్సింగరావు తదితరులు కీలక పాత్ర పోషించారు. సనత్‌నగర్ అయ్యప్ప దేవాలయం నగరంలో రెండోదిగా ఖ్యాతి కెక్కింది.

అయ్యప్ప దీక్షా కాలంలో నిత్య పూజలు..

అయ్యప్ప మండల దీక్ష ప్రారంభమైనప్పటి నుంచి భక్తులు జ్యోతి దర్శనం చేసుకునే వరకు ఇక్కడ నిత్యపూజలు జరుగుతుంటాయి. అయ్యప్ప మాలాధారణ చేసిన భక్తులతో పాటు వారితో వచ్చే కుటుంబ సభ్యులతో నిత్యం ఇక్కడ సందడిగా ఉంటుంది. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, బాలానగర్, మియాపూర్ వంటి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడి స్వామి సన్నిధికి వచ్చి మాలాధారణ చేయడం ఆనవాయితీగా వస్తోంది.

నిత్యాన్నదానం...

ప్రతి ఏటా నవంబర్ 17 నుంచి నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి జనవరి 14 వరకు నిరిఘ్నంగా కొనసాగిస్తారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి డివిజన్ అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లాపూర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా డివిజన్‌లో ప్రతిపాదిత అభివృద్ధి పనులను సిద్ధం చేయాలని ఆయన తెలిపారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.